
సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 30 । మే । 2025



ఇంత బరితెగింపా..!

ప్రభుత్వ భూములను అడ్డగోలుగా ఆన్‌లైన్ చేస్తున్నారు. అధికార పార్టీ నేతల అండదండలతో అధికారులు, సిబ్బంది బరితెగిస్తున్నారు.

- 8లో..



అతి వేగం.. టిప్పర్ బీభత్సం

అతివేగంతో ఓ టిప్పర్ అదుపు తప్పింది. బైక్‌ను ఢీకొట్టి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపటి నుంచి రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

ఒంగోలు: రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ప్రకాశం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.భక్తధృవుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. మహిళలకు 43, 47, 52 కేజీల విభాగాలలో పోటీలు ఉంటాయన్నారు. 31వ తేదీ సాయంత్రం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా గిద్దలూరు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీని గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీని ద్వారా మున్సిపాలిటీకి అదనంగా నిధులు విడుదలై అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. సిబ్బంది పెరుగుదల, అన్నిశాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏ పెరుగుదల వంటి వసతులు దక్కనున్నాయి. గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా 2011 ఆగస్టు 22లో గిద్దలూరు మార్పు చెందింది. ప్రస్తుతం నగర పంచాయతీ నుంచి గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయింది.

ఇంటర్ విద్య జిల్లా అధికారిగా ఆంజనేయులు



డీఐఈఓ ఆంజనేయులును అభినందిస్తున్న ప్రిన్సిపాళ్లు, అధ్యాపకుల సంఘ నాయకులు

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ విద్య జిల్లా అధికారి (డీఐఈఓ)గా తాళ్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి ఆంజనేయులు గురువారం ఒంగోలులోని డీఈఓ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన ఐ.శ్రీనివాసరావు నుంచి ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాళ్ల సంఘం, అధ్యాపకుల సంఘ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఆంజనేయులుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల జేఏసీ చైర్మన్ కుమ్మరకుంట సురేష్, ప్రిన్సిపాళ్ల సంఘ నాయకులు కె.పి.రంగనాయకులు, బి.సి.హెచ్.అల్లూరయ్య, విశ్వనాథబాబు, వెంకట్రావు, పాలపర్తి మాధవరావు, వై.గురవయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీకట్లో మాన్యువల్ కౌన్సెలింగ్

- ఉపాధ్యాయుల వెబ్ కౌన్సెలింగ్ అమలులో ప్రభుత్వం ఘోర వైఫల్యం
- చివరికి హడావిడిగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వైనం

ఒంగోలు సిటీ: స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్‌లో ప్రభుత్వం విఫలమవడంతో రెండు రోజుల నుంచి సంబంధిత ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. అన్ని యాజమాన్యాలకు సంబంధించిన ప్రధానోపాధ్యాయుల బదిలీలు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించి గత పది రోజులుగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం తారుమారైంది. ఈ పదోన్నతులకు సంబంధించి జెడ్పీలో 83, మున్సిపల్ యాజమాన్యం కింద 4, మున్సిపల్ కార్పొరేషన్ కింద 1 పోస్టుకు పదోన్నతులు నిర్వహించాలని విద్యాశాఖ భావించింది. దీనికి సంబంధించిన పదోన్నతులలో 1:3 నిష్పత్తిలో 245 వరకు పిలిచినట్లు సమాచారం. 28వ తేదీ మధ్యాహ్నం పదోన్నతులు నిర్వహించాలనే సమాచారం అందడంతో ఉపాధ్యాయులంతా ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం హైస్కూల్‌కు చేరుకున్నారు. సాయంత్రం 9 గంటల వరకు ఉన్నారు. అయితే, గురువారం ఉదయం 8 గంటలకు హాజరుకావాలని ఉపాధ్యాయులను కోరారు. సాయంత్రం 6.30 గంటలకల్లా వెబ్ కౌన్సెలింగ్ పెట్టాలని చూశారు. చివరికి మాన్యువల్‌గా జరుపుకోవాలని డైరెక్టరేట్ నుంచి ఆదేశాలు వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రమోషన్లకి సంబంధించి 28వ తేదీ మధ్యాహ్నం నుంచి 29వ తేదీ సాయంత్రం 8 గంటల వరకు ఉపాధ్యాయులు పడిగాపులు కాశారు. గత ప్రభుత్వంలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ఉపాధ్యాయులు పెట్టుకున్న వెబ్ ఆప్షన్ల ప్రకారం బదిలీలు, పదోన్నతులకు ఆటోమేటిక్‌గా ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో పూర్తిగా విఫలమైంది. చివరి సమయంలో మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా అనేక అక్రమాలు, రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు లొంగి అవకతవకలకు పాల్పడినట్లు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

పారని పథకాలు.. ఏడాది శోకాలు!

- ఇంటి వద్దకు వచ్చే సేవలు కనుమరుగు
- ప్రభావం కోల్పోయిన గ్రామ స్వరాజ్యం
- రాజకీయ కుట్రలకు బలవుతున్న పల్లెవాసులు
- ఇంటికొచ్చి పలకరించే వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యం
- పట్టెడన్నం పెట్టే అన్నదాత భరోసాకు సున్నంపెట్టిన చంద్రబాబు
- జిల్లాలో 616 ఆర్‌బీకేల ద్వారా మొక్కుబడి సేవలు
- గ్రామీణ వైద్యానికి మంగళం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో మొత్తం 765 పంచాయతీలు, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో మొత్తం 719 గ్రామ, వార్డు సచివాలయాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు.. గ్రామం అంటే గుడి, బడి, పంచాయతీ భవనం మాత్రమే కనిపించేవి. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, బడి ఆధునికీకరణతో కూడిన ఇంగ్లిషు మీడియం, శాశ్వత అంగన్‌వాడీ కేంద్రం, గతంలో మాదిరిగా పాల సేకరణ కేంద్రం.. ఇలా ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు వెలిశాయి. వీటన్నింటితో గ్రామాలు కళకళలాడేవి.

కళ కోల్పోయిన సచివాలయాలు...

జిల్లాలో గ్రామ సచివాలయాలు 584, వార్డు సచివాలయాలు 135 ఉన్నాయి. గ్రామ సచివాలయాల్లో మొత్తం 5,389 మంది, వార్డు సచివాలయాల్లో 1,110 మంది ఉద్యోగులు ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేవారు. సచివాలయం మెట్లు ఎక్కిన వారికి అవసరమైన పనిని నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి ఇచ్చేవారు. సేవలన్నీ ఉచితంగా అందేవి. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలతో కళకళలాడుతూ ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటి ప్రాధాన్యతను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. దీంతో మీ సేవ కేంద్రాలకు, నెట్ పాయింట్లకు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి కల్పించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో దాదాపుగా ప్రతి గ్రామంలోనూ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మించింది. ప్రస్తుతం సచివాలయాలకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోవడంతో అవి కూడా కళ తప్పాయి.

టంగుటూరు మండలం జమ్ములపాలెంలో నిరుపయోగంగా సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవనాలు





నెల మొదటి తేదీ సూర్యోదయానికంటే ముందే వలంటీర్లు ఇంటి తలుపుతట్టి పింఛన్ ఇచ్చేవారు. 50 ఇళ్లకో వలంటీరు ద్వారా సకల సేవలూ అందేవి. కూటమి పార్టీలు వారిని సంఘ విద్రోహశక్తుల్లా అభివర్ణించాయి. అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థకు మంగళం పాడేశాయి. విచిత్రమేమిటంటే వలంటీర్లకు ఒక మంత్రి కూడా ఉన్నారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా ఉచితంగా ఇంటి సమీపంలోనే అందేవి. ఫలితంగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనితప్పింది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అవి కళతప్పాయి. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగే దుస్థితి ఏర్పడింది. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఐదేళ్లు జిల్లా వ్యాప్తంగా 59,30,289 సేవలు అందాయి. పల్లెల్లో ఆర్‌బీకేలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ ఇలా అన్నీ ఒకేచోట ఉండేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భవనాలు నిర్మించింది. చాలా ప్రాంతాల్లో అవి వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతుండటం గమనార్హం. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు మొక్కుబడిగా సేవలందుతున్నాయి. దీంతో పల్లెలు కళతప్పాయి. సేవలు మృగ్యమై జనం కంట కన్నీరుకారుతోంది.

సచివాలయాలు 719	సిబ్బంది 6,499
సేవలు 513 రకాలు	క్లస్టర్లు 12,489
వలంటీర్లు 12,489	మొత్తం ఆధార్ సేవలు 2,85,731

ప్రజలకు అందించిన సేవలు (వైఎస్సార్ సీపీ పాలనలో) 59,30,289

వలంటీర్ల ద్వారా అద్భుత సేవలు...

గత ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఇంటిముంగిటకే అన్నిసేవలూ అందుబాటులోకి తెచ్చింది. రూ.5 వేల గౌరవ వేతనంతో రౌండ్ ది క్లాక్ విధులు నిర్వర్తించిన వలంటీర్లకు ప్రజలు జేజేలు కొడుతున్నారు. వలంటీర్లు క్షేత్రస్థాయిలో ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను అర్హుల చేతికి అందించేవారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఇంటికి వెళ్లి ఆ పథకం గురించి చెప్పి మరీ వాళ్లే దరఖాస్తు కూడా చేసేవారు. జిల్లా వ్యాప్తంగా 12,489 మంది వలంటీర్లు నిరంతరం ప్రజా సేవలో ఉండేవారు. ఎన్నికల ముందు వేతనాలు పెంచి ఈ వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం మంగళం పాడేసింది విచిత్రమేమిటంటే జిల్లాకు చెందిన మంత్రి వలంటీర్ శాఖకు మంత్రిగా ఉండటం.



ఆగిన రేషన్ బండి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్ సరుకులను ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేశారు. ఇప్పటి వరకు అదే వ్యవస్థను కొనసాగించిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం జూన్ 1 నుంచి ఆ వాహనాలను రద్దు చేసింది. ఇక నుంచి రేషన్ షాపు వద్దకు వెళ్లి క్యూలో పడిగాపులు కాస్తూ రేషన్ తీసుకోవాలి. దీంతో ప్రజలు అవస్థలు పడటంతోపాటు ఎండీయూ వాహనాల ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. జిల్లాలో మొత్తం 1,392 రేషన్ షాపులు ఉన్నాయి. అందుకుగానూ రేషన్ సరఫరా చేసే వాహనాలు 385 ఉన్నాయి. వీటిని రద్దు చేయడంతో 385 మంది ఆపరేటర్లు రోడ్డున పడ్డారు. జిల్లాలో 6,70,627 రేషన్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుదారులందరూ జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిందే.



మందుబాబులకు అడ్డాగా..

మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే సెంటర్లకు నిర్మించిన నూతన భవనాలను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. అవన్నీ మందుబాబులకు అడ్డాగా మారాయి. చీకటిపడితే చాలు.. ఆయా భవనాల్లో మందుబాబులు గుంపులుగా చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

చిల్లచెట్ల మధ్యే అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గిద్దలూరు మండలంలోని వెల్లుపల్లె గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాలు నిర్మించారు. వాటి కోసం జగన్ ప్రభుత్వం సుమారు రూ.60 లక్షల మేర ఖర్చు చేసింది. భవన నిర్మాణాలు పూర్తిచేసి ప్రారంభించే నాటికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని అలాగే వదిలేసింది. ప్రజల కోసం వాడుకలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రైతులకు ఉపయోగపడే రైతు భరోసా కేంద్రం భవనం, రోగులకు ఉపయోగపడే విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో వాటి చుట్టూ చిల్లచెట్లు పెరిగి పాడైపోతున్నాయి. అపరిశుభ్రంగా మారి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

గిద్దలూరు రూరల్



గిద్దలూరు మండలం వెల్లుపల్లెలో పిచ్చిమొక్కల మధ్య రైతు సేవా కేంద్రం



గిద్దలూరు మండలం వెల్లుపల్లెలో నిరుపయోగంగా హెల్త్ క్లినిక్

పల్లె వైద్యానికి మంగళం

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా పల్లెల్లో సత్వర వైద్యసేవలు అందేవి. ఇందుకుగానూ గత ప్రభుత్వం సచివాలయాల ప్రాంగణాల్లోనే భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టింది. మొత్తం 492 భవనాలు నిర్మించేందుకు రూ.8,611.00 లక్షల అంచనాలతో మంజూరు చేయగా, ఎక్కువ శాతం పూర్తయ్యాయి. కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏకంగా గ్రామీణ వైద్యానికి మంగళం పాడింది.

రైతుకు దక్కని భరోసా..

జిల్లాలో మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటికి జిల్లా వ్యాప్తంగా 593 భవన నిర్మాణాలు చేపట్టేందుకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.12,553.40 లక్షల అంచనాలతో నిధులు మంజూరు చేయగా, 400 భవనాలు పూర్తయ్యాయి. మిగతా భవనాలు పురోగతిలో ఉన్నాయి. ప్రతి సంవత్సరం రైతు భరోసా కింద దాదాపు 3 లక్షల మంది రైతులకు నాలుగు విడతలుగా రూ.13,500ను నేరుగా వారి ఖాతాలకు జమచేసేవారు. రైతులకు నిత్యం అవగాహన కార్యక్రమాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవన్నీ నిలిచిపోయాయి. అన్నదాతతో అనుబంధం పెంచుకున్న రైతు భరోసా కేంద్రం నిర్జీవమైపోయింది. అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తానన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క పైసా విదిల్చలేదు. పండించిన పంటలకు మద్దతు ధర లభించక అప్పుల పాలై రైతులు రోడ్డున పడుతున్నారు.



పొన్నలూరు మండలం బోగనంపాడులో నిరుపయోగంగా ఆర్బీకే

నిరుపయోగంగా గ్రామ సచివాలయ భవనాలు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లాలో మొత్తం 591 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలను రూ.22,655 లక్షల అంచనాలతో మంజూరు చేశారు. అందుకుగానూ 398 భవనాలను పూర్తి చేశారు. మరో 193 భవనాలు పురోగతిలో ఉన్నాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి నిర్మాణాల గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.



ప్రారంభానికి నోచుకోని శంకరాపురం సచివాలయం

ఆర్‌బీకేలు అన్నదాతకు అండగా నిలిచాయి



రైతు భరోసా కేంద్రాలు అన్నదాతకు అండగా నిలిచాయి. క్షేత్రస్థాయిలోనే రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందజేసి అన్ని రకాల సేవలు ఒకేచోట లభించే విధంగా చర్యలు తీసుకున్నారు. పెట్టుబడి నిధులు మంజూరు, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు, పంట పండించక ముందే ఆయా పంటలకు మద్దతు ధర, విపత్తుల సమయంలో బీమా సౌకర్యం, ఇన్‌పుట్ సబ్సిడీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి అనేక సౌకర్యాలు కల్పించారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. రైతులను అన్ని విధాలుగా కూటమి ముంచేసింది.

– వెన్నపూస మాల్యాద్రిరెడ్డి, రైతు, చెన్నిపాడు, పొన్నలూరు

పేదల పిల్లలు ఆంగ్లం నేర్చుకోకూడదా.?



కూటమి ప్రభుత్వం వచ్చాక పేద పిల్లలకు ఆంగ్ల మాధ్యమం అందకుండా చేస్తోంది. 2019 వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య నేర్చుకోవాలంటే ధనికుల పిల్లలకు మాత్రమే అవకాశం ఉండేది. కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని పేదలకు ఆంగ్ల మాధ్యమం చేతికందిన అమృత ఫలంలా మారింది. దానిని జీర్ణించుకోలేని కూటమి నాయకులు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం రద్దు చేసి పేదలకు అందని ద్రాక్షలా చేసింది. – ఇందూరి దేవి, కురిచేడు

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లపై చిన్నచూపు



ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (హెల్త్ క్లినిక్)లను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. దీంతో పల్లెల్లో వైద్యం అంతంతమాత్రంగానే అందుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాల పరిధిలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించింది. స్వగ్రామాల్లోనే ప్రజలంతా మెరుగైన వైద్యం పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా సేవలను నిర్వీర్యం చేసింది. అందులో పనిచేస్తున్న సీహెచ్‌ఓల డిమాండ్లు తీర్చకపోవడంతో ఇటీవల వారు విధులకు దూరమై ప్రజలకు వైద్యసేవలు నిలిచిపోయాయి.

– టి.ఆంజనేయులు, పామూరు

వలంటీర్లు లేకపోవడంతో సేవలు దూరం



సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఇంటివద్దనే అన్ని రకాల సేవలు అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వలంటీర్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సేవలను వలంటీర్ల ద్వారా ఇంటివద్దకే అందించింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వలంటీర్లను తొలగించడంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ కార్యాలయంలో పనికోసం దరఖాస్తు చేసుకోవాలంటే వలంటీర్లు చేసిపెట్టేవారు. అలాంటి వలంటీర్లను కొనసాగిస్తామని ఎన్నికల వేళ చెప్పి ప్రస్తుతం తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నారు.

– షేక్ గయాజ్, పామూరు

రైతుల జీవితాలతో కూటమి చెలగాటం

- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి

సింగరాయకొండ: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ రాష్ట్రంలోని పొగాకు రైతుల్లో జిల్లాలోనే 70 శాతం ఉండగా, కొండపి నియోజకవర్గంలోనూ అత్యధికంగా ఉన్నారన్నారు. పొగాకు బోర్డు 170 మిలియన్ టన్నులు పొగాకు పండించుకోవడానికి అనుమతిచ్చిందన్నారు. మే నెలాఖరుకు 70 శాతం కొనుగోలు చేయాల్సి ఉండగా, కేవలం 25 శాతంలోపే కొనుగోలు చేశారన్నారు. గత ప్రభుత్వంలో పొగాకు క్వింటా ధర రూ.38 వేల వరకు ఉంటే.. కూటమి ప్రభుత్వంలో రూ.20 వేలలోపు మాత్రమే ఉందన్నారు. పొదిలి పొగాకు వేలం కేంద్రానికి జగనన్న వస్తున్నాడన్న ప్రకటనతో మేల్కొన్న కూటమి ప్రభుత్వం రూ.20 వేల నుంచి రూ.23 వేలకు కొనుగోలు చేయాలని ఆదేశించినప్పటికి 5 శాతం కొనుగోలు చేసి మిగతా పొగాకు వెనక్కి పంపుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో ఐఎల్‌టీడీ కంపెనీ గుత్తాధిపత్యానికి గండికొట్టిన జగనన్న.. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించి రైతులకు మంచి ధరలు ఇప్పించారని బత్తుల గుర్తుచేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, పాల్గొన్న నాయకులు

రైతుల కోసం ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసిన జగనన్న...

రైతులకు మద్దతు ధర కల్పించేందుకు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన విషయాన్ని బత్తుల బ్రహ్మానందరెడ్డి గుర్తుచేశారు. ఆ నిధిని రూ.7 వేల కోట్లకు పెంచి రైతుల పట్ల తనకున్న చిత్తశుద్ధిని జగనన్న చాటుకున్నారన్నారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క పంటకూ మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. ఐటీసీ కంపెనీతో కుమ్మక్కై పొగాకు రైతులను నట్టేట ముంచిందన్నారు. మహానాడు వేదికగా సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఎన్నికల్లో చెప్పని పథకాలు కూడా అమలు చేస్తున్నామని టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారంటూ బత్తుల బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసులు, చింతపల్లి హరిబాబు, బచ్చల కోటేశ్వరరావు, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ సుల్తాన్ పాల్గొన్నారు.



క్లుప్తంగా

కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలో నివాసం ఉంటున్న కానిస్టేబుల్ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి కానిస్టేబుల్‌గా అర్ధవీడులో పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంటాడు. ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం తిరుపతికి వెళ్లిన సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తెరిచి అందులోని వస్తువులు అపహరించారు. ప్రసాద్ తిరుపతి నుంచి తిరిగి ఇంటికి వచ్చే సరికి ఇంటి వెనుక భాగంలో ఉన్న తలుపులు తెరచి ఉండటం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బైక్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

మార్కాపురం: టూవీలర్‌ను వెనుక నుంచి మరో టూవీలర్ ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి పట్టణంలోని వై జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. తర్లుపాడు మండలం మంగళకుంట గ్రామానికి చెందిన భార్యాభర్తలు షకీలా, నాగేశ్వరరావు వ్యక్తిగత పనిపై మార్కాపురం పట్టణానికి వస్తున్నారు. వారి వెనుకే వస్తున్న మరో టూవీలర్ అదుపుతప్పి భార్యాభర్తలను ఢీకొట్టింది. గాయాలైన సంఘటన చోటుచేసుకుందని పట్టణ పోలీస్‌లు తెలిపారు. తీవ్రంగా గాయపడిన భార్యాభర్తలను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

న్యాయవాదులు బాధ్యతగా పనిచేయాలి


హైకోర్టు జడ్జి మన్మథరావును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

సింగరాయకొండ: న్యాయవాదులు బాధ్యతగా పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించి న్యాయాన్ని కాపాడాలని హైకోర్టు జడ్జి కె.మన్మథరావు పిలుపునిచ్చారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని గంజి కళ్యాణ మండపంలో గురువారం రాత్రి ఆయనకు ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మన్మథరావు మాట్లాడుతూ దేశంలో కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందన్నారు. ఇటీవల హైకోర్టు జడ్జిలంతా సమష్టి కృషితో కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. తాను ఒక్కడినే 13 వేల కేసులు పరిష్కరించానన్నారు. దీంతో కేసుల పరిష్కారంలో ఏపీకి రెండో స్థానం దక్కిందన్నారు. సింగరాయకొండలో నూతన కోర్టు ఏర్పాటుకు తన కృషి కన్నా ఇక్కడి అవసరాలే కారణమన్నారు. అనంతరం జడ్జి మన్మథరావుకు ఆత్మీయ పౌర సన్మానం చేశారు. సింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులనాయుడు, అడ్వకేట్ పంగులూరి గోవిందయ్య, మేకల రామ్మూర్తి, డాక్టర్ కొంపల్లి హెచ్ఎస్ఎస్ సుందర్, డాక్టర్ నూకసాని సుబ్బారావు, అడ్వకేట్ రాయి రమేష్, కొల్లూరి నరసింహారావు, బక్కమంతుల వెంకటేశ్వర్లు, పంతగాని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంత బరితెగింపా..!

- అడ్డగోలుగా ప్రభుత్వ భూముల ఆన్‌లైన్
- నేతల అండదండలతో బరితెగిస్తున్న అధికారులు, సిబ్బంది
- ప్రభుత్వ భూమని తెలిసినా అక్రమంగా ఆన్‌లైన్ చేసేస్తున్న వైనం
- ఉన్నతాధికారుల ఆదేశాలూ బేఖాతరు.


కురిచేడు:

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన అధికారులే భక్షకులుగా మారుతున్నారు. ప్రభుత్వ భూములను కంటికి రెప్పలా కాపాడాల్సిన అధికారులే అక్రమాలకు తెరలేపారు. దీంతో ఎన్నో ఏళ్ల నాటి ప్రభుత్వ భూములు రాత్రికి రాత్రే ప్రైవేట్‌పరం అయిపోతున్నాయి. స్థానిక రెవెన్యూ కార్యాలయంలోని అధికారుల లీలలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. కూటమి నాయకుల అండదండలతో అడ్డగోలుగా ప్రభుత్వ భూములకు ఆన్‌లైన్ చేసి దండుకుంటున్నారు. ఒక వైపు ఉన్నతాధికారులు ప్రభుత్వ భూములపై విచారణ జరిపేందుకు ఆదేశాలు ఇచ్చినా, కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నా వాటిని పట్టించుకోకుండా ఆన్‌లైన్ చేయడం విశేషం.

ప్రభుత్వభూమి ఆన్‌లైన్..


మండలంలోని కల్లూరు గ్రామ సర్వే నంబర్ 272/74 లోని ప్రభుత్వ భూమిని కొంతమంది పేర్లతో ఆన్‌లైన్ ఎక్కించినట్లు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పాలెబోయిన పెద్ద పెద్దయ్య ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల అవినీతి దాహంతో గ్రామంలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు బరితెగించి మాకు కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయని బాహాటంగా చెప్పుకుంటున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ కార్యాలయంలో పని చేసే ఒక వ్యక్తి తన కుటుంబసభ్యుల పేరుపై సర్వే నంబర్ 272/1కే లోని 3 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేశారు. అలాగే 272/74 లోని ప్రభుత్వ భూమిని నక్కా ఆంజనేయులు పేరుతో 50 సెంట్లు ఆన్‌లైన్ చేశారు. అదే సర్వే నంబర్‌లోని మరో 50 సెంట్లు నక్కా లింగమ్మకు అనువంశికం కింద ఆన్‌లైన్ చేశారు. వల్లెం వెంకటేశ్వర్లు పేరుతో కూడి మరో 50 సెంట్ల భూమిని ఈ నెల 19వ తేదీ ఆన్‌లైన్ చేశారు. వాస్తవానికి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి గయాల్ అని ఉంది. గతంలో పనిచేసిన తహసీల్దార్ నాగుల్‌మీరా సైతం ప్రభుత్వ భూమి అని ఎండార్స్‌మెంట్ చేశారు. అలాగే సమాచార హక్కుచట్టం ద్వారా కూడా 272/1కే, 39 సర్వేనంబర్లు గయాలు భూమిగా సమాధానం ఇచ్చారు. అలాగే నక్కా లక్ష్మీదేవి పేరుపై ఉన్న మూడు ఎకరాల భూమిపై విచారణ చేయాలని డీఆర్‌ఓ ఓబులేశు గత మార్చి నెలలో విచారణకు ఆదేశించారు. ఈ భూములపై గ్రామస్తులు సైతం హైకోర్టులో కేసు వేశారు. ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నా, కోర్టుల్లో పెండింగ్ ఉన్నా అధికారులు అవేమీ మాకు సంబంధం లేదని అక్రమంగా ఆన్‌లైన్ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడితే రెవెన్యూ అధికారుల లీలలు బయటకు వస్తాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు.


సమాచార హక్కుచట్టం ద్వారా నక్కా లక్ష్మీదేవికి ఆన్‌లైన్ చేయలేదని ఇచ్చిన ఎండార్స్‌మెంటు


Adangal

సర్వే నెం : 272-1K పూర్తి విస్తీర్ణం : 3.0
సాగుకు పనికి రాని విస్తీర్ణం : 0.0
సాగుకు పనికి వచ్చు విస్తీర్ణం : 3.0
భూమి స్వభావం : పట్టా
శిస్తు (రూ.) : 0.0 భూమి వివరణ : మెట్ట
జల ధారము : లేదు ఆయకట్టు విస్తీర్ణం : 0.0
ఖాతా నెంబరు : 767
అనుభవదారుని విస్తీర్ణం (ఎకరాలు-సెంట్లు) : 3.0
పట్టాదారు పేరు నక్కా లక్ష్మీదేవి
(తండ్రి/భర్త పేరు) : (చిన్న వెంకటేశ్వర్లు)
అనుభవదారుని పేరు నక్కా లక్ష్మీదేవి
(తండ్రి/భర్త పేరు) : (చిన్న వెంకటేశ్వర్లు)
అనుభవ స్వభావం : అనువంశికము
రిమార్కులు :

ఆన్‌లైన్‌లో లక్ష్మీదేవి పేరుపై ఉన్న భూమి


ఆ సర్వే నంబర్లు గయాల్ భూమిగా నిర్ధారిస్తూ తహసీల్దార్ ఇచ్చిన ఎండార్స్‌మెంట్

పీఆర్సీ కమిషన్ నియమించాలి


కౌన్సిల్ సమావేశం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు

- ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్
- 14 ప్రధాన సమస్యల పరిష్కారానికి జూన్ 5న కౌన్సిల్ సమావేశం

ఒంగోలు సిటీ: సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతోపాటు మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సంఘ ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన విజయవాడలోని లయోలా కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కౌన్సిల్ మూడో సమావేశానికి ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది హాజరై విజయవంతం చేయాలని కోరారు. గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న 14 ప్రధాన డిమాండ్ల సాధనకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.20 వేల కోట్లకు పైగా ఉన్న పీఆర్సీ, డీఏ, ఎస్ఎల్ఎస్, ఏపీజీఎల్ఐ బకాయిల చెల్లింపునకు కాలపరిమితితో కూడిన రూట్ మ్యాప్ విడుదల చేయాలన్నారు. సీపీఎస్/జీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణకు ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. ఒకటో తేదీనే వేతనం, పెన్షన్ల చెల్లింపు చట్టబద్ధం చేయాలన్నారు. జూన్ 5వ తేదీన ఉదయం 6 గంటలకు ప్రకాశం భవన్ నుంచి విజయవాడకు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి వరకుమార్, పట్టణ అధ్యక్షుడు మోటా శ్రీనివాసరావు, ట్రెజరర్ యేసు రత్నం, తాలూకా అధ్యక్షుడు సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు యువకులపై దాడి మంత్రి మనోహర్ పనే..

- నాదెండ్లను బర్తరఫ్ చేయాలని దళిత సంఘాల డిమాండ్

ఒంగోలు వన్‌టౌన్: తెనాలిలో దళిత, మైనారిటీ యువకులను దారుణంగా హింసించి, కర్కశంగా ప్రవర్తించిన పోలీసులపై కేసులు నమోదు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. యువకులను బహిరంగంగా లాఠీలతో మోది చిత్రహింసలు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఒంగోలులో భారీ ప్రదర్శన చేపట్టి, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత యువకులపై కూటమి ప్రభుత్వ మంత్రి నాదెండ్ల మనోహర్ దాడి చేయించారని ఆరోపించారు. తెనాలి ఐతా నగర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించేందుకు మంత్రితోపాటు పోలీసు, మున్సిపల్ అధికారులు చేసిన ప్రయత్నాలను దళితులు అడ్డుకున్నారన్నారు. మూడు రోజులపాటు దళితులు ఆందోళన చేయడంతో మంత్రి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ క్రమంలో పోలీసులకు, దళితులకు మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని గుర్తుచేశారు. ఇది మనసులో పెట్టుకుని దళిత యువకులను పోలీసులు దారుణంగా కొట్టారని, కిరాతక పోలీసులు రాములు నాయక్, రమేష్ బాబును అరెస్టు చేయాలని, నాదెండ్ల మనోహర్‌ను రాష్ట్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కోటిమాదిగ, మాల సంఘాల జేఏసీ నాయకులు టి.శోక్‌బాబు, కె.ఏడుకొండలు, కేవీపీఎస్ నాయకుడు రఘురాం తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

అతి వేగం.. టిప్పర్ బీభత్సం

- బైక్‌ను ఢీకొట్టి, పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన వైనం
- ఒకరికి తీవ్ర గాయాలు


సిమెంట్ దిమ్మె పైకి దూసుకెళ్లిన టిప్పర్


గాయపడిన లక్ష్మీనారాయణ

పొదిలి: మితిమీరిన వేగంతో వెళ్తున్న టిప్పర్ అదుపు తప్పి బైక్‌ను ఢీకొట్టడమే కాకుండా పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బీభత్సం సృష్టించిన ఈ సంఘటన గురువారం పొదిలి నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెం సమీపంలో ఒంగోలు-కర్నూలు హైవేపై చోటుచేసుకుంది. వివరాలు.. వినుకొండకు చెందిన పెనుమాల్ల లక్ష్మీనారాయణ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను డ్రైవింగ్ చేసే మినీ లారీ మర్రిపూడి మండలం చిమట గ్రామంలో బొప్పాయి కాయల లోడింగ్‌కు వెళ్లింది. లారీ ఓనర్ తాను డ్రైవింగ్ చేస్తానని చెప్పి తన మోటారుసైకిల్‌పై లక్ష్మీనారాయణను వెళ్లాలని సూచించాడు. బైక్‌పై పొదిలి వైపు వస్తున్న లక్ష్మీనారాయణను కాటూరివారిపాలెం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. బైక్‌ను తొక్కుకుంటూ పెట్రోల్ బంకు వైపు దూసుకెళ్లిన టిప్పర్ అక్కడ ఉన్న హోర్డింగ్‌లను ఢీకొట్టి, సిమెంటు దిమ్మె పైకి ఎక్కింది. పెట్రోల్ బంకులోకి నేరుగా దూసుకెళ్లి ఉంటే పెను ప్రమాదమే జరిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గాయపడిన లక్ష్మీనారాయణను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. టిప్పర్ డ్రైవర్ మద్యం తాగి వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

సురక్షితమైన తాగునీరు అందించాలి

- జలజీవన్ మిషన్ నోడల్ అధికారి దినేష్‌కుమార్


అక్కచెరువులో మాట్లాడుతున్న నోడల్ అధికారి దినేష్‌కుమార్

పొదిలి రూరల్: ఇంటింటికి సురక్షితమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ నోడల్ అధికారి వి.దినేష్‌కుమార్ అన్నారు. మండలంలోని అక్కచెరువు గ్రామంలో రూ.96.10 లక్షలతో చేపట్టిన జల జీవన్ మిషన్ పథకం పనులను గురువారం ఆయన పరిశీలించారు. తొలుత పంచాయతీ కార్యాలయంలో పథకానికి సంబంధించి పనుల పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర్‌రావు ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తరువాత రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో దినేష్‌కుమార్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడి భూగర్భనీటి వనరులు పెంచాలన్నారు. ఈ పథకం అమల్లో సమస్యలు ఏమైనా ఉన్నాయా అని గ్రామస్తులు అడిగారు. ఈ క్రమంలో గృహాలు హెచ్చు తగ్గులుగా ఉండటంతో శివారు ప్రాంతాలకు నీరు సరఫరా అందడం లేదని తెలిపారు. అనంతరం కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంకు, ఇంటింటికీ ఏర్పాటు చేసిన నీటి కుళాయి, పశువుల షెడ్డు, ఫారంపాండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్ చేరెడ్డి నాగలక్ష్మి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారి కె.రవితేజ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండ్లూరు డొంక మహిళా ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఆపైన విద్యార్హత ఉండాలన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనం ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9963005209 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.




ఒంగోలు ఆర్టీసీ డిపోలో బస్సుల రాక కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

మహా తిప్పలు

టీడీపీ తలపెట్టిన మహానాడు గురువారం ప్రయాణికులను గోడాడించింది. టీడీపీ కార్యకర్తలతో పాటు డ్వాక్రా మహిళలను తరలించేందుకు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను మహానాడు నిర్వహిస్తున్న కడప పట్టణం వైపు మళ్లించడంతో గమ్య స్థానాలకు చేరుకోవడానికి జనం నానాఅవస్థలు పడ్డారు. జిల్లాలోని అన్ని డిపోల్లో ప్రయాణికులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది.

– సాక్షి, ఒంగోలు




బస్సు ఎప్పుడొస్తుందో.. ఇంటికెప్పుడుపోవాలో..







సర్వీస్ ఏదైనా ఇదే సీన్..

ఎవరూ ఎక్కలేదాయే..!

యర్రగొండపాలెం: కడపలో మహానాడు ముగింపు సభకు జనాన్ని తరలించి తమ సత్తా చూపించాలని ఉవిళ్లూరిన టీడీపీ నాయకులకు భంగపాటు ఎదురైంది. గురువారం యర్రగొండపాలెం నుంచి ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను ఎవరూ ఎక్కకపోవడంతో బస్టాండ్‌లోనే నిలిచిపోయాయి. కనిగిరి డిపో నుంచి యర్రగొండపాలెం బస్టాండ్‌కు 3 పల్లెవెలుగు, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు చేరుకోగా ఆ పార్టీ కార్యకర్తలు ఎవరూ ఎక్కలేదు. చివరికి ఎక్స్‌ప్రెస్ బస్సులో 30 మంది ఉపాధి హామీ మేట్లు వెళ్లారు. బస్సులు ఇలా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.


వైపాలెం ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిచి ఉన్న బస్సులు